ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 సంచిక : 03 నవంబర్ 2013

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు 1993

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు – 1993)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సుఖము, శాంతి, ఆనందం మన లోపలే ఉన్నాయి. అవి మనకు అందకుండా మనలో ఉన్న కామక్రోధములు మనకు అడ్డు వస్తున్నాయి. కామక్రోధములు మన లోపలఉన్న శత్రువులు. వాటిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. మన లోపలఉన్న శత్రువులను వదిలేసి బయటఉన్న శత్రువుల గురించి మనం ఎక్కువగా ఆలోచిస్తున్నాము. దేహప్రారబ్ధమును బట్టి కష్టాలు వస్తూ ఉంటాయి, పోతూఉంటాయి. వాటిని చూసి మీ శాంతిని పాడుచేసుకోవద్దు. కష్టాలు వచ్చినప్పడు మాకు శాంతి కావాలి, ఆనందం కావాలి అని భగవంతుడిని ప్రార్థిస్తాము, సాధనలు చేస్తాము. ఆ కష్టాలు పోయిన తరువాత సాధన వదిలేస్తాము. శాశ్వతమైన ఆనందం కోసం, సుఖంకోసం ఆలోచించము. కుటుంబంలో వచ్చే కష్టాలు, సమాజ పరంగా వచ్చే కష్టాలు తట్టుకోవటం కష్టంగా ఉంటుంది. భగవంతుడిని స్మరిస్తూ ఉంటే, ఆయనను పూజిస్తూ ఉంటే, ఆయనను ప్రేమిస్తూ ఉంటే మన మనస్సు చల్లబడుతుంది. మనస్సు చల్లబడినప్పడు కుటుంబంలో వచ్చే కష్టాలను, బయటనుండి వచ్చే కష్టాలను తట్టుకొనేశక్తి మనకు కలుగుతుంది. కళ్లతో చూసే విషయాలు, ఇంద్రియాలతో గ్రహించే విషయాలు, నీ మనస్సులోనికి వచ్చే గొడవలు అన్నీ కూడా ప్రతిబింబాలు, ఇవి అన్నీకూడా దృశ్యములు. వాటిని చూసి కంగారు పడవద్దు. ఏ సుఖానికి ముగింపులేదో అట్టిది ఆత్మసుఖం. దానిని

అనుభవించేవాడు దృశ్యాల మీద ఆధారపడిఉండడు, ప్రపంచంతో అతనికి పనిలేదు. మనకు ఆత్మసుఖం అందితే అది ఎప్పడూ జీవనదిలా ప్రవహిస్తూ ఉంటుంది. దేహంపోయినా ఆ గొడవే దానికి ఉండదు.

మనకు బాధలు కలిగినప్పుడు తాత్కాలికంగా వాటినుండి బయటపడటానికి చూస్తాము. అంతేగాని అవి ఎందుకు వచ్చాయి అని మనం విచారణ చెయ్యటం లేదు. దుఃఖకారణం గురించి ఆలోచించటంలేదు. పనివలన మనకు దుఃఖంరాదు, మమకారం వలన దుఃఖం వస్తోంది. పనిమీద దృష్టిపెట్టండి, మమకారం మీద దృష్టివద్దు. హృదయపూర్వకంగా పనిచెయ్యి. ఫలితం ఆశించవద్దు. మీకు దుఃఖం వచ్చినప్పడు దాని నివారణకోసం ఏ గురువు వద్దకు వెళదాము, ఏ దేవుని దర్శిద్దాము, ఏ పుణ్యక్షేత్రానికి వెళదాము అని పరుగులు పెట్టవద్దు. నిలబడి ఈ దుఃఖానికి కారణం ఏమిటి అని విచారణ చెయ్యండి. శాశ్వతమైన ఆనందం పొందటంకోసం ప్రయత్నం చెయ్యండి. ఆనందం కోసం మనం ప్రపంచంలో వెతుకుచున్నాము. నిజమైన ఆనందం మన హృదయంలోనే ఉంది. అక్కడ వెతికినప్పడు మాత్రమే అది నీకు లభ్యమవుతుంది. మనం నిజమైన భక్తులముకాదు. మనకు భక్తి ఉంది కాని అది కోరికలకు పరిమితమై ఉంది. మన దృష్ఠి అంతా కోరికలపైనే ఉంటుంది. దేహం గొడవలేకుండా అంటే దేహం దాని ప్రారబ్దం ప్రకారం నడుస్తుంది అని దాని గొడవ వదిలేసి మనస్సును భగవంతుడి మీద సదా నిలబెట్టినవాడే నిజమైన భక్తుడు.

మీరు ఎంత డబ్బు సంపాదించినా, ఎంత గొప్పపదవులు చేసినా నిజమైన ఆనందమును పొందలేరు. నీవు ఎవరో నీవు తెలుసుకొంటే అప్పడు నిజమైన ఆనందం నీకు అందుతుంది. నీవు ఆత్మవు. ఆత్మను తెలుసుకొన్నప్పడు మాత్రమే, ఆత్మానుభవం పొందినప్పడు మాత్రమే నిజమైన ఆనందం నీకు దొరుకుతుంది. అప్పటివరకు నీవు ఎన్ని జన్మలు ఎత్తినా, ఏ లోకాలకు తిరిగినా ఆనందం గురించి నీకు తెలియదు. నువ్వు ఎవరవు అంటే ఆత్మవు. అందుచేత ఆత్మతప్ప మిగిలిన విషయాలను తోసివెయ్యి, ఏది వచ్చినా గెంటివెయ్యి. అలా చేయకపోతే నీవు బంధంలో పడతావు. గౌరవం నీవుకాదు, అగౌరవం నీవుకాదు, మంచిచెడ్డలు నీవుకాదు, దేహం నీవు కాదు. నీవు ఆత్మవు. ఆత్మ తప్ప మిగిలిన వాటిని గెంటివేయి. ఆత్మ తప్ప ఏ విషయాలతో కలిసినా వాటినుండి ఎడబాటు తప్పదు, వియోగం తప్పదు. ఆత్మతప్ప మిగిలినవన్నీ

ప్రతిబింబాలు, వాటినన్నింటినీ తోసివెయ్యి. శాశ్వత ఆనందమును పట్టుకో. కొంతకాలం ఉండి పోయేవాటిని పట్టుకోవద్దు. అక్కరలేని చిల్లర విషయాలు నీ మీద పడినా వాటిని తోసివెయ్యి. అవి నువ్వుకాదు కాబట్టి వాటిని గెంటివెయ్యి. వాటితో ఉంటే బంధంలో పడతావు. పనిదొంగలు కావద్దు. హృదయపూర్వకంగా పని చెయ్యండి. నువ్వు ఎన్ని గుడులు కట్టినా, ఎన్ని పూజలు చేసినా, ఎన్ని యాత్రలు చేసినా చివరకు ఇవి అన్నీ చేసే ఈ నేను ఎవరు? అనే ప్రశ్న రావలసిందే. దీనికి ఎన్నో జన్మలు పట్టవచ్చును. అంతకాలం ఈ చిల్లరగొడవల లోనికి వెళ్ళి కాలాన్ని వ్యర్థం చేసుకోవద్దు. ఇప్పడే ఈ నేను ఎవరు? అని ప్రశ్నించుకోండి. ఎప్పడైనా ఈ గుమ్మంలోనికి రావలసిందే. ఈ గుమ్మంలోనికి రాకుండా బ్రహ్మం గురించి తెలుసుకోవటం సాధ్యం కాదు. భగవాన్ ఎన్ని మాటలు చెప్పినా, ఆ మాటలు ఎంత కఠినంగా చెప్పినా మిమ్మలను నిజం దగ్గరకు తీసుకొని పోవటానికే ఆయన ప్రయత్నం. ఎందుచేతనంటే మీరు నిజం దగ్గరకు చేరుకొనేవరకు మీకు జన్మలు తప్పవు. ఆయన మీ దగ్గరనుండి ఏమీ ఆశించటంలేదు. తాను పొందిన ఆనందం యొక్క స్థాయికి మిమ్ములను తీసుకొని పోవటానికే ఆయన ప్రయత్నం. జ్ఞానికి గౌరవాలతో పనిలేదు. ఆయన ముఖంమీద ఉమ్మి వేసినా అక్కడ స్పందన ఏమీ ఉండదు, మిమ్ములను హృదయస్థానంలోనికి తీసుకొని పోవడానికే చూస్తాడు. కుటుంబం అంటే మనకు ఇంటిలోని వ్యక్తులే మన కుటుంబం కాని జ్ఞానికి ఈ సృష్ఠి అంతా ఆయన కుటుంబం.

అక్కరలేని గొడవలలోకి వెళ్ళి నీ మనస్సును పుండు చేసుకోవద్దు. మనస్సును నిర్మలంగా ఉంచుకో. ఆత్మానుభవం పొందటానికి నిదానంగా, నిరాడంబరంగా, నిర్మలంగా ప్రయాణించు. ఆత్మను తప్ప దేనినీ లక్ష్య పెట్టవద్దు. మిగిలిన గొడవలు వద్దు. ఆత్మ తప్ప మిగిలిన వాటిని గెంటివేయి, తోసివేయి నీవు చేసే పూజలు, యాగాలు ఉన్నాయి అనుకొంటున్నావు కాబట్టి వాటిని గెంటేయి అని చెపుతున్నాను. ఆత్మానుభవం పొందాక ఇవి అన్నీ అబద్ధాలు అని, నీకు భిన్నంగా ఇతరం ఏమీ లేదని నీకు తెలుస్తుంది. అప్పడు గెంటటానికి, తోసెయ్యటానికి ఏమీ లేదు. ఆత్మమాటకు అందదని ఆయనకు తెలుసు. కాని మనకు అర్థం కావటానికి మాటలతో ఎంతవరకు చెప్పాలో అంతవరకు భగవాన్ చెపుతున్నారు. నీవు నిజం అనుకొనే స్వర్గాలు, నరకాలు, దేవతలు, జన్మలు ఇవి అన్నీ కూడా అబద్ధమైన నేను మీద ఆధారపడి ఉన్నాయి. నీ ఆలోచనలు, ఆశయాలు, ప్రయత్నాలు చివరకు నువ్వు

కూడా అబద్ధమైన నేను యొక్క కల్పితాలు. ఆత్మకు వీటికి ఏవిధమైన సంబంధం లేదు. అబద్ధమైన నేనును గెంటివేస్తే ఇంక ఏ గొడవ లేదు. నీ ప్రారబ్ధమును బట్టి నీవు ఏ విషయాలలో ఉన్నా అవి నేను కాదు అని నీ బుద్ధితో వాటిని గెంటివెయ్యి. అజాగ్రత్తగా ఉండవద్దు. భగవంతుడు ఏ పని చేయమని మనలను ఈ భూమిమీదకు పంపాడో ఆపనిని జాగ్రత్తగా చేయండి. భగవంతుడు మీకు కేటాయించిన డ్యూటీని సక్రమంగా శ్రద్ధగా నిర్వర్తించండి. మిగిలిన విషయాలను గెంటివేయండి, తోసివేయండి.

పూజలు చేసేది, జపాలు చేసేది, యాత్రలు చేసేది అన్నీ చేసేది ఈ అబద్ధమైన నేనే. నిజమైన నేనుకు వీటితో సంబంధం లేదు. అది వీటన్నింటికీ అతీతముగా ఉంది. భక్తియోగంలోను నేను ఉంది, కర్మయోగం లోనూ ఈ నేను ఉంది, ధ్యానయోగంలోను ఈ నేను ఉంది. అన్ని యోగాలలోనూ ఇది ఉంది. అన్నింటిలోను ఉన్న ఈ నేను ఎవరు? అన్న ప్రశ్న నీ లోపల నుండి రావాలి. అప్పుడు అజ్ఞానమునకు కోత పడుతుంది. మనస్సు రెండు పనులు చేస్తూ ఉంటుంది. చేస్తే శివస్మరణ చేస్తుంది. శివస్మరణ వదిలేస్తే రెండోది శవ స్మరణ. శివుని కంటే శవం అంటే మనకు ఎక్కువ ప్రీతిగా ఉంది. అందువలన మనకు అశాంతి కలుగుతోంది. ఈ శవాన్ని మనం సత్యం అనుకొంటున్నాము. శివుని ప్రార్థిస్తున్నాము కాని,ఆయనే మాకు కావాలి అని అనుకోవటంలేదు. ఈ శవానికి సంబంధించిన కోరికలకోసం శివుని ప్రార్థిస్తున్నాము. కోరికలు కోరుతూఉంటే ఆయన అనుగ్రహం వాటికే పరిమితమైపోతుంది. శివుడే మాకు కావాలి అనే భావనతో ప్రార్థించండి. మాటల వలన జ్ఞానం రాదు. ఎవడైతే తన హృదయాన్ని శివుడికి ఇస్తాడో వాడికి జ్ఞానం కలుగుతుంది. మనకు ఏది అవసరమో శివుడికి తెలుసు. ఆయనకు తెలియదు అనుకొని కోరికలు కోరతాము. మన దేహప్రారబ్దంలో ఉన్నది మనం కోరుకోకుండానే అది వస్తుంది. ఒకవేళ కోరుకున్నా దేహప్రారబ్దంలో ఉన్నదే మనం కోరుకొంటాము. ఇది గ్రహించండి.

కాలాన్ని పాడుచేసుకోవద్దు. డబ్బుపోతే సంపాదించుకోవచ్చు కానీ పోయిన కాలం తిరిగి రాదు. అందువలన అక్కరలేని గొడవలలోనికి వెళ్ళి కాలాన్ని పాడుచేసుకోవద్దు. సాధ్యమైనంతవరకు ఇతరుల గొడవల లోనికి వెళ్ళవద్దు. దేహం ఉంది కాబట్టి దానికోసం అంటే దేహానికి భుక్తికోసం కొంతకాలాన్ని వినియోగించు. మిగిలిన కాలాన్ని అంతా ముక్తి

కోసం వినియోగించు. మనం అవసరాలు పెంచుకొంటాము, దాని వలన ఖర్చులు పెరుగుతాయి. వీటికోసం సంపాదన గురించి ఎక్కువగా ఆలోచిస్తాము. ఇంక మనకు ధనంమీదే ధ్యాస ఉంటుంది, కాని దేవుని ధ్యాసరాదు. దేవుడు ఉన్నాడా లేడా అని అనుమానిస్తూ ఉంటాము. మనకు అన్నింటిగురించి అనుమానాలే. జీవితం పొడుగునా ప్రతివిషయంలోనూ మనకు అనుమానమే. నీ లోపల ఉండి ఎవడైతే ఇలా అనుమానిస్తున్నాడో వాడిని అనుమానించు. మాటలకు అందని ఆత్మను, మనస్సుకు అందని ఆత్మను మాటలతో, మనస్సుతో పట్టుకొందామని చూస్తున్నావు. అది ఎలా సాధ్యమవుతుంది. మాటలతో, మనస్సుతో ఆత్మను పట్టుకొందామని ఇలా ప్రయత్నం చేయటం నీ వెర్రితనం. ఈ మాటలను, మనస్సును తోసివెయ్యి. ఆత్మ తప్ప మిగిలినవన్నీ కల్పితాలు, వాటిని గెంటివెయ్యి, నా మనస్సులో ఎన్నో గొడవలు ఉన్నాయి, మనస్సు శాంతిగా లేదు అని చెపుతూ ఉంటావు. నీ మనస్సులో ఎన్ని గొడవలు ఉంటే ఏమి అది నువ్వు కాదుకదా అనేవారు భగవాన్. నువ్వు మనస్సువు కాదు అందువలన దానిని గెంటివెయ్యి. ఎప్పుడైతే మీకు మీరు సహాయం చేసుకోవటం మానివేస్తారో అప్పుడు భగవంతుని సహాయం అందుతుంది. భగవంతుని మీద భారం వేయటం నేర్చుకోండి. ఆయన మీద భారం వేస్తే అంతా ఆయనే చూసుకుంటాడు.

లోకాన్ని శోధించటం వలన జ్ఞానం రాదు, మనస్సును శోధించటం వలన జ్ఞానం కలుగుతుంది. మీరు చేసే పని చిన్నదా, పెద్దదా అని దేవుడు చూడడు. ఆ పనిని ఏ భావనతో చేస్తున్నావో భగవంతుడు చూస్తాడు. చిన్న పనే చేయండి. ఆ పనిని ప్రేమతో, శాంతితో, ఆనందంతో చేయండి. ప్రేమభావనతో పని చేసినప్పుడు ఆధ్యాత్మిక వికాసము కలుగుతుంది. పాండిత్యంవలన, కీర్తివలన జ్ఞానం కలుగదు. జ్ఞానం కోసం మనం పుస్తకాలలో వెదుకుచున్నాము. ఇలా పుస్తకాలలో వెదుకుచున్న మానవ మానసమును లోపలకు త్రిప్పటానికి అంటే హృదయంలోనికి గెంటటానికి వచ్చిన అవతారమే రమణావతారం. బట్టలు మారవచ్చు, దేహాలు మారవచ్చు, పరిస్థితులు మారవచ్చు, లోకం మారవచ్చు. నేను ఉంటేనే ఇవి అన్నీ ఉన్నాయి. అది లేకపోతే ఏదీలేదు. అందుచేత ఈ నేను అనే సమస్యను మొదట పరిష్కారం చేసుకోవాలి. భగవంతుడికి మినహాయింపులు లేని శరణాగతి పొందు. అప్పుడు ఈ నేను నుండి విడుదల చేసి ఆయన స్వరూపాన్ని నీకు యిస్తాడు. మరణ సమయంలో

భక్తునికి కైలాసం పోవాలి అనే గొడవ, వ్యవసాయదారునికి పొలాలు గొడవ, డాక్టర్లకు పేషంట్ల గొడవ ఇలా వారివారి సమస్యలు గుర్తు వస్తాయి తప్ప ఎవరికీ ఆత్మ గొడవ లేదు. వాస్తవము ఎవరికీ అక్కరలేదు. నిజం తెలిస్తేగాని ఎవరికీ స్వేచ్ఛ లేదు, సుఖం లేదు. నీవు కైలాసానికి వెళ్ళినా, వైకుంఠానికి వెళ్ళినా తిరిగి ఈ భూమి మీదకు రావలసిందే. తాత్కాలికంగా ఉండే గొడవల మీద దృష్టిని కేంద్రీకరించవద్దు, నిజంపై దృష్టి పెట్టు.

నీ సాంఘిక పరిస్థితులు, సమాజ పరిస్థితులు, లోక పరిస్థితులు అన్నీ మారిపోతూ ఉంటాయి. కాని మార్పులేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది, దానిని పట్టుకో. దానికి సందేహాలు, తలంపులు, ఊహలు ఏమీ లేవు, అదే ఆత్మ. దానిని పట్టుకో. నశించే దేహాలను, నశించే తలంపులను, నశించే కోరికలను విడిచిపెట్టి నశింపులేని ఆత్మను పట్టుకో. ఒకోసారి పరిస్థితులు మీకు అనుకూలంగా ఉండవచ్చును. వాటిని చూసి అహంకారమును పెంచుకొంటే మీరు చాలా నష్టపోతారు. దేహము దాని ప్రారబ్ధం ప్రకారము నడిచి నశిస్తుంది. నీ సాధన ద్వారా దానితో తాదాత్మ్యం పొందకుండా చూసుకో. జ్ఞానమును సంపాదించాలంటే నీలో ఉన్న సంకుచిత భావములను విడిచిపెట్టు. ప్రేమభావనను పెంచుకో. జ్ఞాని తాను చెప్పాలని చెప్పటం ఉండదు. తను పొందిన స్థితికి మనలను తీసుకొనిపోవటానికి, తను పొందుతున్న ఆనందాన్ని మనకు పంచివ్వటానికి చెప్పకుండా ఉండలేక చెపుతూ ఉంటాడు. ప్రేమసందేశమును వ్యాప్తి చేయటంకోసం ఇంటింటికి తిరుగు. ఆ ప్రయత్నంలో నిన్ను తిట్టారనుకో కొట్టలేదు అని సంతోషించు. ఒకవేళ కొట్టారనుకో చంపలేదు అని సంతోషించు. అంతేగాని ప్రేమసందేశమును వ్యాప్తి చేయటానికి వెనుకాడవద్దు.

మీకు మంచి ఆలోచనలు వచ్చినా, చెడు ఆలోచనలు వచ్చినా, స్వార్థం వచ్చినా ఏది వచ్చినా వాటికి దేహం కేంద్రంగా ఉంటుంది. దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని చేసే పనుల వలన అబద్ధమైన నేను బలపడుతూ ఉంటుంది. ఈ దేహము ఎవరిది అంటే నాది అంటున్నావు. అంటే దేహముకు భిన్నంగా నేను ఉంది. ఇలా భిన్నంగా ఉన్న నేనును పట్టుకో. జ్ఞాని సంపదను అందరూ అందుకోలేరు. సద్బుద్ధి ఉన్నవారు, సహృదయము ఉన్నవారు మాత్రమే జ్ఞాని సంపదను అందుకోగలరు. భగవాన్ అరుణాచలం వచ్చి గోచీ పెట్టుకొన్నారు. అరుణాచలంలో సంపద, కీర్తి అంతా వచ్చి ఆయన మీద కురిసింది. కాని ఆయన గోచీ

విడిచిపెట్టలేదు. అందరూ మిమ్మలను చూడటానికి వస్తున్నారు. మీరు గోచీతో ఉండటం బాగోలేదని ఒక భక్తురాలు భగవాన్‌ను అడిగింది. మీరు ఏ ఉద్దేశంతో ఇక్కడకు వచ్చారు అని భగవాన్ ఆమెను అడిగారు. ఇక్కడ ఒక మహాత్ముడు ఉన్నాడని వచ్చాము అని చెప్పింది. మీరు ఏ ఉద్దేశంతో అయితే వచ్చారో అలాగే చూడండి, ఆ పనే చూసుకోండి. అంతేగాని ఈ గోచీల గొడవ వద్దు అని భగవాన్ చెప్పారు.

తప్పచేసిన వానిని క్షమించమని మన గ్రంధాలు చెపుతున్నాయి. వాడు తప్పచేసాడు అనే స్పృహ లేకపోతే ఇంక క్షమించటం అనే గొడవలేదు. జ్ఞానిస్థితి అట్టిది. వర్తమాన కాలమును పట్టుకోండి. ఈ క్షణంలో ఏమి జరుగుతోందో చూసుకోండి. దేహము నాకు దగ్గరగా ఉంది అనుకొంటున్నావు. కాని నీ దేహం కంటే, నీ ఇంద్రియముల కంటే బ్రహ్మం నీకు అతి దగ్గరగా నీ హృదయంలోనే ఉంది. అది తెలియకుండా భూత, భవిష్యత్ కాలాల గొడవలు నీకు అడ్డువస్తున్నాయి. అందువలన ఆ గొడవలను గెంటివెయ్యండి. ఎప్పడో ఏదో అవుదామనే గొడవ తప్ప సత్యం గురించి తెలుసుకోవాలనే తపన ఎవరికీ లేదు. మీ లోపల ఉన్న సద్వస్తువుపై దృష్టిని పెట్టండి. బాహ్యవస్తువులతో తిరుగుతున్న మనస్సును లోపలకు గెంటండి. మీకు లోదృష్టి కలిగినప్పడు లోపల ఉన్న సత్యం గురించి మీకు తెలుస్తుంది. అన్నింటికీ ఆధారమైన సత్యాన్ని వదిలేసి ఏవో చిల్లర గొడవలు పట్టుకొని ఎక్కడికో పోతున్నావు. మిగిలిన గొడవలు వద్దు, వాటిని తోసివెయ్యండి, సత్యంపై దృష్టి పెట్టండి. సాధన యొక్క గమ్యం మన హృదయాన్ని ఖాళీ చేయటం. పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలు, సంస్కారాలు, కోరికలు అనే బండరాళ్ళు మన హృదయంలో ఉన్నాయి. ఆ బండరాళ్ళను తొలగించటానికి మన ప్రయత్నం సరిపోదు. ఒక్క ఈశ్వరానుగ్రహం వలన మాత్రమే ఆ బండరాళ్ళు కొట్టుకొని పోతాయి తప్ప అది మన ప్రయత్నం వలన జరిగేది కాదు.

ఆత్మ అంతటా ఉంది అని చెపుతున్నారుకదా అయితే నా కళ్ళకు ఎందుకు కనబడటంలేదు అని భగవాన్‌ను అడిగారు. కళ్ళకు కనిపించేది నిజం అనుకొంటున్నావు, కళ్ళకు కనిపించనిది అబద్ధం అనుకొంటున్నావు. నీటిలో ఉన్న ఉప్ప కళ్ళకు కనిపిస్తోందా? లేదు. నోటిలో వేసుకొంటే తెలుస్తుంది. అలాగే ఆత్మకూడా కళ్ళకు కనబడదు. హృదయంలో ఉన్న ఆత్మ నీ అనుభవానికి అందుతుంది. ఆత్మ అనుభవంలోనికి వచ్చాక అది మాత్రమే

అంతటా వ్యాపించి ఉంది అని స్పష్టంగా నీకు తెలుస్తుంది. దానిని ఎలా తెలుసుకోవటం అని అడిగితే నీ యింద్రియాలను బంధించి, బాహ్యవిషయాల నుండి విడుదల పొంది లోపల ఇంటికి ప్రయాణించాలి, అంటే నీ నిజమైనఇంటికి ప్రయాణించాలి అంటే హృదయంలోనికి చేరుకోవాలి. వివేకము, పని, ఆరాధన ఈ మూడింటిని విడిచిపెట్టవద్దు. ఎదుటివారు అసభ్యంగా మాట్లాడినా నీవు సభ్యతగా ఉండు. మనకు ఉన్న తెలివిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. వివేకాన్ని పోగొట్టుకొంటే మనం జీవితంలో చాలా నష్టపోతాము. పనిని విడిచిపెట్టవద్దు. పరమేశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం కలిగి ఉండాలి. మీ విశ్వాసం నిజమైతే మీలో ఉన్న దోషాలను భగవంతుడు తొలగిస్తాడు. మనం ఎంతసేపు ఎదుటి వారి క్షేమం కోరుకోవాలి కాని వారి చెడ్డను కోరరాదు. చెడ్డను కోరితే ఆధ్యాత్మిక జీవితానికి దూరమైపోతాము. ఎవరి పట్ల వికారం పెట్టుకోవద్దు. భగవంతుని పట్ల మధురభక్తి కలిగి ఉంటే ఆయనలో ఐక్యమౌతాము. చిన్న మొక్కలను ఎలా జాగ్రత్తగా పెంచుతామో అలాగే మనలోని భక్తిని జాగ్రత్తగా కాపాడుకొంటూ, సత్పురుషులతో సహవాసం చేస్తూ భక్తిని పెంచుకోవాలి.

మనం ఏ పని చేయటానికి ఈ భూమి మీదకు వచ్చామో అది నీకు ఇష్టం ఉన్నా, ఇష్టంలేకపోయినా నీ దేహం ద్వారా ఆ పని జరుగుతుంది. నువ్వు ఇష్టంగా ఆ పని చేసావు అనుకో పాతవాసనలు పోతాయి, కొత్త వాసనలు పుట్టవు. అందుచేత నీ చేతిలో ఉన్న పనిని ఇష్టంగా చెయ్యి, ప్రీతిగా చెయ్యి. అది కూడా సాధన. ఒకవేళ నీకు ఇష్టం లేకపోయినా ఆ పని చెయ్యటం తప్పదు. ఇష్టంలేకుండా పనిచేస్తే ఆ పని బంధం అవుతుంది. అందువలన చేసే పని ఇష్టంగా చెయ్యి. కుటుంబంలో మీరు చేసే పని శ్రద్ధగా చెయ్యండి. ఇతరుల మీద ఆధారపడవద్దు. ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. చేసే పని నిర్మలంగా చెయ్యండి. గొప్పలకు వెళ్లవద్దు. గొప్పలకు వెళ్లితే తిప్పలు తప్పవు. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు అని భగవాన్ చెపుతున్నారు కదా ఇంక ఈ ప్రయత్నాలు, సాధనలు ఎందుకు? జరిగే విషయాల ప్రభావం మన మీద పడకుండా చూసుకోవటానికి, ఆ విషయాలతో మనం తాదాత్మ్యం పొందకుండా ఉండటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. మన బట్టమీద పురుగు ఉంది అని చూపించి దానిని తొలగించుకోమంటే వెంటనే దానిని గెంటివేస్తాము. కాని మనలోని దోషములను

చూపించి వాటిని తొలగించుకోమంటే మనకు కోపం వస్తుంది. వాటిని తొలగించుకోవటానికి మనం ఇష్టపడము. ఎందుచేతనంటే వాటితో మనం తాదాత్మ్యం పొంది ఉంటున్నాము. అందువలన వాటిని తొలగించుకోవటానికి మనం ఇష్టపడటంలేదు.

లోకంలోని గొడవలతో కలసిపోవద్దు. లోకంలోని గొడవల గురించి ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటే ఆ గొడవలలోనే ఉండిపోతావు. భగవంతుని మీదకు నీ ధ్యాస పోదు. ఎవరి మీద అయినా నీకు ఇష్టం ఉన్నా, ద్వేషం ఉన్నా నీ మనస్సు వారిపైనే ఉంటుంది, మనస్సు వారినే చింతిస్తూ ఉంటుంది, భగవంతుని చింతించలేదు. అందువలన నీ మనస్సుకు సమానత్వం నేర్పి వీటినన్నింటిని దాటిపోవాలి. ప్రారబ్దమును బట్టి డబ్బు, చదువు, గౌరవము, పదవులు రావచ్చును. అవి వస్తే రానియ్యి వాటితో తాదాత్మ్యం పొందవద్దు. అప్పుడు అబద్ధమైన నేను సన్నగిల్లి నెమ్మదిగా హృదయగుహలో పడిపోతుంది. మీరు ఎక్కడ ఉన్నా, ఏ జన్మలో ఉన్నా ఆత్మానుభవం పొందే వరకు ఏజీవుడిని బాధలు విడిచిపెట్టవు, ఏదో రూపంలో వెంటాడుతూనే ఉంటాయి. ఇప్పుడు రోజులు బాగానే వెళ్ళిపోతున్నాయి అని అనుకోవద్దు. రాబోయే రోజులు ఎలా ఉంటాయో నీకు తెలియదు, రాబోయే జన్మలు ఎటువంటి జన్మలు వస్తాయో నీకు తెలియదు. ఆత్మానుభవం పొందేవరకు ఈ బాధలు తప్పవు. అందువలన ఆత్మానుభవం పొందటానికి ఇప్పడే ప్రయత్నం చెయ్యి. ఎప్పుడో చేద్దామని అనుకోవద్దు. ఇప్పడే ఆ ప్రయత్నం చెయ్యి, ఆ ప్రయత్నంలో జీవించు.

జ్ఞాని చెప్పిన మాటను మాత్రమే వినాలి. వాటిని ఆచరించటానికి ప్రయత్నం చెయ్యాలి. అంతేగాని ప్రతీమాటను భుజాన వేసుకొని తిరగవద్దు. మనం బాహ్యపరిస్థితులను మెరుగు పరుచుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము కాని మరణానంతరం మనకూడా వచ్చే మనస్సును పవిత్రం చేసుకోవటానికి మనం ప్రయత్నం చేయటం లేదు. మనం పుట్టినప్పుడు మనస్సు ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది, ఎంతవరకు వికాసం వచ్చింది, మనస్సులో ఎంతవరకు మార్పు తీసుకొని వచ్చాము అని ఎవరూ చూసుకోవటం లేదు, ఆ విధమైన జిజ్ఞాస ఎవరకీ కనబడటం లేదు. అదే మనం చేసే పెద్ద పొరపాటు. చాలాకాలం నుండి ధ్యానం చేస్తున్నాను, అభివృద్ధి కనబడటంలేదు అంటారు. అభివృద్ధి గురించి నీకు ఏమి తెలుస్తుంది. ఆధ్యాత్మిక అభివృద్ధి గురించి లెక్కలు వేయవద్దు. అది ఈశ్వరుడు చూసుకొంటాడు. నీవు చేసే

ప్రయత్నం శ్రద్ధగా చెయ్యి, ధ్యానం చెయ్యి, విచారణ చెయ్యి, ఏది చేసినా వాటియొక్క లోతులు పెరగాలి. లోతులు పెరిగినప్పడు సద్వస్తువు యొక్క ఉనికి నీకు తెలుస్తుంది, దానిని పట్టుకొని హృదయగుహలోనికి ప్రవేశించవచ్చును. ఎవరికైతే బ్రహ్మంయొక్క ఉనికి మీద విశ్వాసం లేదో వారు కళ్ళు ఉన్నా గుడ్డివారితో సమానము అని ఆచార్యులవారు చెప్పారు.

ఇతరులను విమర్శించవద్దు, మనలను మనం విమర్శించుకోవాలి. ఎదుటివారిలో ఉన్న మంచిని చూడాలి. మనలోని దోషాలను చూసుకోవాలి. మనలో దోషాలున్నాయి అని తెలిసినప్పడు వాటినుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేస్తాము. బ్రహ్మం అంతటా ఉంది, మన హృదయంలోను ఉంది. మన మనస్సులో ఉన్న దోషాల వలన అది మనకు వ్యక్తం కావటం లేదు. మన మనస్సులో ఉన్న దోషాలను తొలగించుకోవటానికి మనం చేసే ప్రయత్నమే సాధన. హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం అక్కరలేదు. నీలో ఉన్న దోషాలను తొలగించుకోవటానికే ప్రయత్నం అవసరం. నీలో ఉన్న దోషాలు పూర్తిగా నశిస్తే అది నీకు వ్యక్తమౌతుంది. అన్ని మతముల సారం ఒక్కటే. మతంయొక్క సారాన్ని మనం అనుభవం లోనికి తెచ్చుకొంటే అప్పడు దాని యొక్క వైభవం మనకు తెలుస్తుంది. అంతేగాని చిల్లర మాటలు పట్టుకొని మతం పేరు మీద గంతులు వేయవద్దు.

బ్రహ్మానుభవం పొందటానికి కర్మమార్గం, భక్తిమార్గం, జ్ఞానమార్గం ఇలా అనేకమార్గాలు చెప్పారు. పూర్వజన్మలను బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క మార్గం మీద ఇష్టం కలుగుతుంది. ఎవరికి ఏ మార్గం ఇష్టమో గుర్తించి ఆ మార్గంలో నడిపించి గమ్యానికి తీసుకొని పోయేవాడే నిజమైన గురువు. గురువు అవసరం లేకుండా బ్రహ్మానుభవం పొందినవారు ఈ సృష్టిలో ఎవరైనా ఉన్నారా అని కంచిస్వాములవారిని అడిగితే ఉన్నారు అని అంటూ అరుణాచల మహర్షి అని చెప్పారు. బ్రహ్మానుభవం కలిగినవాడు మాత్రమే మీకు బ్రహ్మానుభవం కలగటానికి సహకరించగలడు. అట్టివాడే గురువు. ఆధ్యాత్మికమార్గంలో పురోభివృద్ధికి గురువు అవసరం. భగవాన్‌కు గురువు లేడు కాని గురువు అవసరం లేదని ఆయన ఎప్పడూ చెప్పలేదు. గురువు ఆత్మజ్ఞానమును బోధిస్తాడు. ఆత్మజ్ఞానం లేకపోతే ఆత్మానుభవం కలుగదు. శిష్యునికి ఉండవలసిన లక్షణం ఏమిటి అంటే ఆత్మానుభవం పొందాలి అనే స్థిరనిర్ణయం వాడికి ఉండాలి, దానిపైనే వాడి దృష్టి ఉండాలి. ఆత్మజ్ఞానం యొక్క విలువ వాడికి తెలియాలి.

డబ్బు విలువ మనకు తెలుస్తోంది కాబట్టి దానిని సంపాదించటానికి మనం ప్రయత్నం చేస్తున్నాము. అలాగే ఆత్మజ్ఞానంయొక్క విలువ మనకు తెలిస్తే దానిని పొందటం కోసం మనం ప్రయత్నం చేస్తాము.

తెలుసుకోవాలి అనే కోరిక ఉన్న చోట విషయాలు చెప్పాలి. జిజ్ఞాస లేనిచోట విషయాలు చెప్పవద్దు. అర్హత లేనిచోట సంభాషణ అనవసరం. నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని అని అనుకోవద్దు. నేను ఆత్మను అని అనుకో. మంచి చెడ్డలు మనస్సుకు సంబంధించినవి. అందువలన వాటితో తాదాత్మ్యం పొందవద్దు. నీవు ఆత్మవు. చిల్లర గొడవలు వద్దు. నీ విషయములు అన్నీ గురువు చూస్తూ ఉంటాడు. ఎవరూ చూడకుండా నేను చేస్తున్నాను అని నీవు చేసేపనులు కూడా గురువు చూస్తాడు. నీ విషయములు అన్నీ గురువుకు తెలుసు. నీకు ఎప్పుడు ఏది కావాలో గురువు సహాయం చేస్తూనే ఉంటాడు. కాని ఆ సహాయాన్ని అనుభవించే శక్తి నీకు ఉన్నప్పుడు అది నీకు తెలుస్తుంది. దేహగతంగా శిష్యుడు గురువుకు దగ్గరగా ఉండాలి లేక దగ్గరగా ఉండనక్కరలేదు అని ఖచ్చితంగా చెప్పలేము. ఇది శిష్యుని మానసిక స్థాయిని బట్టి ఉంటుంది. గురుశిష్యుల మధ్య శరీరాలు ప్రధానం కాదు, మానసిక అనుబంధం ముఖ్యం. శిష్యుడు గురువుతో మానసిక అనుబంధం కలిగిఉండాలి. తనంతవానిగా శిష్యుడిని చేసేవరకు ఏ గురువు కూడా శిష్యుడిని విడిచిపెట్టడు.

మన ఇంద్రియాలను, దేహమును, మనస్సును అదుపు చేయడానికి చేసే ప్రయత్నమే తపస్సు. వాటిని అదుపు చేసుకొంటూ వాటిని ఉపయోగించుకొని ఆత్మజ్ఞానమును పొందాలి. మనకు పని మీద శ్రద్ధ ఉండదు. ఫలితం మీద శ్రద్ధ ఉంటుంది. పని శ్రద్ధగా చెయ్యి, ఫలితం ఆశించవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. కొంతమంది పనిచేసి, పని వలన వచ్చిన ఫలితాన్ని సమాజానికి అర్పిస్తారు, అలా చేయటం వలన వారికి ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. చాకలి బట్టలను బండరాయికి పెట్టి కొడతాడు. బట్టలను చింపటానికి కాదు, వాటికి ఉన్న మురికిని పోగొట్టటానికి అలా చేస్తాడు. అలాగే ఆత్మానుభవం కలగటానికి మీకు ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించటానికి మిమ్మల్ని గురువు ఇరుకున పెడతాడు. అప్పుడు మీకు చాలా బాధ అనిపిస్తుంది. మిమ్మల్ని బాగుచేయటానికే గురువు అలా చేస్తున్నాడు తప్ప మిమ్మల్ని బాధపెట్టటానికి కాదు. గురువు ఆగ్రహం కూడా అనుగ్రహం అని గ్రహించినవాడు ధన్యుడు.

ప్రపంచం ఎంత విశాలంగా ఉందో నీ హృదయాన్ని కూడా అంత విశాలంగా చెయ్యి. అప్పుడు జ్ఞానం నీ దగ్గరకు వస్తుంది. హృదయంలో ప్రేమ ఉన్నప్పుడు మాటలతో పని ఏముంది? జ్ఞాని మౌనంతోనే బోధిస్తాడు. మౌనం అర్థంకానప్పుడు మాటలు చెపుతాడు. అవి మాటలు కాదు, ఆయన అనుగ్రహం. అహంభావమే నీవు అనుకొంటున్నావు. అహంభావమే నీవు అనే తప్పడు భావన తొలగించుకొంటే హృదయంలో ఉన్న నిజం ఇప్పడే, ఇక్కడే అనుభవం లోనికి వస్తుంది. అందువలన ఈ తప్పడు భావనను తొలగించుకునే ప్రయత్నం చెయ్యి. ఏదో ఒకరకమైన ప్రయత్నం ద్వారా అహంకారం అనే రోగమును తగ్గించుకో. ఏ ప్రయత్నం చేయకపోతే ఈ రోగం ఎలా తగ్గుతుంది. బ్రహ్మం గురించి ఎలా తెలుస్తుంది అని ఆచార్యుల వారిని అడిగితే బ్రహ్మం గురించి విన్నంత మాత్రంచేత బ్రహ్మం తెలియదు, అహంకారంగా ఉన్న వాడికి బ్రహ్మం గురించి తెలియదు, దేహంగా ఉన్నవాడికి బ్రహ్మం గురించి తెలియదు, బ్రహ్మంగా ఉన్నవాడికి బ్రహ్మం గురించి తెలుస్తుంది అందుచేత బ్రహ్మంగా ఉండండి అని చెప్పారు.

నేనుగా ఉండవద్దు, తానుగా ఉండమని చెపుతున్నారు అంటే బ్రహ్మంగా ఉండమని, ఆత్మగా ఉండమని చెప్పటం. మనం అందరం మాయ అనే వలలో పడి జననమరణ చక్రంలో తిరుగుచున్నాము. జాలరి చేపలకోసం వలను వేసినప్పడు వాడి పాదాల దగ్గర ఉన్న చేపలు వలలో పడవు. అలాగే భగవంతుడి పాదాలను ఆశ్రయించినవాడు మాయ అనే వల నుండి తప్పించుకోగలడు. అందువలన పరమేశ్వరుని పాదాలను ఆశ్రయించండి. మనస్సును నిదానంగా నడిపించటానికి నేను ఎవడను? అనే ప్రశ్న సహకరిస్తుంది. ఇది ఒక అంకుశం లాంటిది. ఒక్క ఆత్మను తప్ప మీరు దేనిని లక్ష్యపెట్టవద్దు. మిగిలిన విషయాలన్నింటిని పట్టించుకోవద్దు, వాటిని గెంటివెయ్యండి. అక్కరలేనిగొడవలలోనికి వెళ్లవద్దు. వాటిగురించి ఆలోచించవద్దు. ఆత్మజ్ఞానం పొందటానికి నీవు చేసే ప్రయాణంలో అసలు వెనుకకు చూడవద్దు. దగ్గర బంధువుల గొడవలు కూడా వినవద్దు. ఆత్మానుభవం పొందటం మీదే నీ దృష్టిని పెట్టు. నీ శక్తినంతా దాని మీదే పెట్టు. మిగిలిన గొడవలను గెంటివెయ్యి, వాటిని తోసివెయ్యి. మనలను ప్రేమించే వారిని మాత్రమే మనం ప్రేమిస్తాము. ఇది సామాన్య మానవులు చేసే పని. కాని నీవు భక్తుడవు. అందువలన నిన్ను ద్వేషించే వారిని కూడా ప్రేమించు. అప్పడు నీ చైతన్యస్థాయి పెరుగుతుంది, నీకు జ్ఞానం కలుగుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## పరంజ్యోతి

అనంతము, అఖండము, ఆరిపోని దీపము, జ్యోతులకు జ్యోతి, మన స్వరూపంగానే ఉంది. అట్టి పరంజ్యోతికి గుర్తుగానే ప్రతి సంవత్సరం కార్తీకమాసం కృత్తికా నక్షత్రం రోజున సాయంత్రం అరుణగిరిపై జ్యోతిని వెలిగిస్తారు. దీపము పరమాత్మ ఉనికికి గుర్తు. ప్రకాశం అక్షర స్వరూప ఎరుకకు గుర్తు. అందువల్లనే ఏ శుభకార్యమైనా దీపారాధనతో మొదలుపెడతాం. ప్రకాశం సమత్వానికి గుర్తు. దీపం తాను ప్రకాశిస్తూ, తన చుట్టూ ఉండేవాటిని సమానంగా ప్రకాశింపజేస్తుంది. కార్తీక దీపం యొక్క నిజతత్త్వాన్ని భగవాన్ శ్రీ మురుగనార్‌కి ఇలా వివరించారు "దేహమే - నేను అను మూలతలంపును నాశనం చేసి, అనగా కేవలం దేహానికే పరిమితం చేసిన నేనును దాని మూలంలో ఐక్యం చేసి, దానికి ఆధారంగా ఉన్న 'నిజమైన - నేను'ను తానుగా అనుభవైకవేద్యం చేసుకొనుటయే, నిజమైన దీపదర్శనం. సకల సృష్టికి ఆధ్యాత్మిక కేంద్రం హృదయమే! లోకంలో సూర్య, చంద్రులు జగత్తును ప్రకాశింప జేస్తారు. కాని జాగ్రదవస్థలో ఉన్న దీపము స్వప్నావస్థలో ఉండదు. అట్లే స్వప్నావస్థలో ఉన్న దీపము గాఢనిద్రలో ఉండదు. కాని ఆత్మ దీపము మూడు అవస్థలను అవిచ్ఛిన్నంగా ప్రకాశింపజేస్తోంది. ఆ పరంజ్యోతి కారణంగానే సూర్యుడు మున్నగు ఇతర జ్యోతులు ప్రకాశించుచున్నవి. దీపములకు దీపమై, అఖండంగా, నిరంతరంగా, స్వయంగా, హృదయంగా, భాసిస్తున్న ఆత్మజ్యోతిని 'తాను'గా అనుభవైకవేద్యం చేసుకొని, సచ్చిదానంద అమృతస్థితియే స్వరూపంగా అనుభవైకవేద్యం చేసుకొనుటయే, అరుణాచల దీపోత్సవం యొక్క పరమార్థం!

ఓం తత్ సత్

(దిll 17-11-2013 అరుణాచల దీపోత్సవం సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# రూపాల్లో భేదాలు ఉంటాయి - స్వరూపంలో ఏ భేదం లేదు

సామాన్య మానవుడు స్థూలాకృతిలేని దానిని భావన చెయ్యలేడు. దృశ్యాలను చూడకుండా ఉండటానికి ప్రత్యేకించి చేయవలసిన సాధన అంటూ ఏమీ లేదు. మన కళ్ళు మనలను మోసం చేస్తూనే ఉంటాయి. ఆ చూడటం తప్పని మనం తరువాత గ్రహించి పశ్చాత్తాప పడతాడు నిజసాధకుడు. ఈ ఘర్షణలో నిత్యం సతమతమౌతూంటే గురువు వాటి లేమితనాన్ని ఇలా తెలుపుతాడు. అందగత్తె అయిన ఒక మహారాణి మరణిస్తే వారి గురువుగారు 'నేను మూడు రోజుల్లో వస్తాను, ఆ శవాన్ని పదివేల వరహాలకు అమ్ముతామని ప్రజలకు తెలపండి' అనగా ఊరికే ఇస్తానన్నా ఎవరూ ముందుకు రాలేదు. దానిపై ఆయన శిష్యులకు 'దృశ్యాలు అన్నీ చచ్చిపోయేవే అని గ్రహిస్తే వాటిపట్ల సాధన చెయ్యవలసిన అవసరంలేదు' అన్నారు. మనస్సు రూపాలకు ఎంత అలవాటు పడిందంటే అందమైన రూపం కనబడితే అందుల్లో కలిసిపోయి మునిగిపోతుంది. ప్రహ్లాదునకు విష్ణువు దర్శనమిస్తే విష్ణువు 'నా బాహ్యరూపాన్ని చూచి జుర్రుకొంటున్నావు. నీలోపల నిజవిష్ణువుని చూస్తే ఎంత ఆనందపడతావో' అన్నారు. ఎంతవరకూ తత్వజ్ఞానం కలగదో అంతవరకూ రూప సంకటాలతో చిత్తశాంతి కలగదు. అది కలగనంతకాలం తత్వజ్ఞానం కలుగదు. వాసనలు నశించకుండా తత్వజ్ఞానం కలగదు. వేమన "రూపు వంక పేరు రూఢిగా నిలుచును; పేరు వంక క్రియలు పెరుగుచుండు; నాశనమౌను తుదకు నామరూప క్రియన్" అన్నారు. ఈ సృష్టిలో అన్నిరూపాలకు ఆధారంగా ఉన్నది సత్యపదార్థమే. కానిదానికి ఏరూపం లేదు. ఈ సత్యం జ్ఞానికి అనుభవంలో ఉంటుంది కాబట్టి ఏ వికారాలు ఆయన్ని అంటుకోవు. అంతా తానే మోహమెక్కడ వికారం ఎక్కడ? నానాతత్వం మనకు కనిపించినంతకాలం భ్రాంతిలో ఉన్నట్లే. శ్రీ నాన్నగారు "ఆత్మయందు స్త్రీపురుష బేధం లేదు" అన్నారు. కాబట్టి భ్రాంతికి లోబడి పశుప్రాయులు అవ్వకూడదు. ఈ ప్రపంచం ఉన్నదని చెప్పలేము, లేదనీ చెప్పలేము. ఇది సత్యానికి నీడ అంటారు పెద్దలు సత్యం ఎల్లప్పుడూ ఒక్కటే దాన్ని అనేకంగా కనిపింపచేసేది మనస్సే. నానాతత్వం చూస్తున్నప్పుడు ఏకత్వమైన ఆత్మ కనబడదు. ఏకత్వమును చూచినపుడు అనేకత్వం పోతుంది. భ్రాంతి అనేది ఒక మేఘము. వివేకమనే గాలి దానిని నెట్టివేసిన వినీలాకాశం మిగులుతుంది. ఆత్మయొక్క శక్తి వల్లనే మనం చూడడం, వినటం, ఆలోచించటం, తినటం చేస్తున్నాము. వీటిని అన్నీ నీ వివేకంతో సమన్వయించి ఉన్నది ఒక్కటే పదార్థము. ఈ సృష్టి ప్రయోజనము ఒక్కటే అదే ఏకత్వమును దర్శించటానికే. నేను స్త్రీని, నేను పాపిని, నేను మనస్సును, నా సంకల్పములు ఇవి అన్నవి అన్నీ భ్రాంతులే. ఇతరులకన్న నేను వేరు అనెడి భావము వల్ల ద్వేషం, అసూయ, దుఃఖం, సంఘర్షణ అన్నీ కలుగుతాయి. తన్ను తాను తెలుసుకొంటే శాంతే. ఈ ద్వంద్వాలకు కేంద్రస్థానం అహంకారమే. అవి అన్నీ మనోవికారాలే. ఈ ఆటను అంతా ఎవరు ఆడుతున్నారు. ఆ శక్తిస్వరూపిణే. ఆమె మాయతోనే ఆడుకొంటున్నది. ఒక్కటైనశక్తి అనేకమైనది. అది దేవరహస్యం. ఈ రహస్యాన్ని బట్టబయలు చేసేశక్తి గురువు చేతిలో ఉంది. అందుకనే ఆయన్ని శరణువేడి శాశ్వత శాంతిని పొందాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**